జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 37 15-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

# కష్టాల బండిని గాడిన పెట్టడమే లక్ష్యం

- భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్
- సంక్షేమాన్ని కొనసాగిస్తూ అభివృద్ధి
- మూలధన వ్యయం పెంచుతూ ప్రగతి
- రెవెన్యూ లోటు కట్టడిపైనా దృష్టి.. జీఎస్‌డీపీలో అప్పుల వాటాపై నియంత్రణ
- 3,32,205 కోట్లతో రాష్ట్ర బడ్జెట్.. 2025-26 కంటే 10 వేల కోట్లే పెంపు
- కేంద్ర నిధులపై వాస్తవిక అంచనా.. రెవెన్యూ వ్యయం రూ.2,56,142 కోట్లు
- అందులో సంక్షేమ వ్యయం వాటాయే 23 శాతం



అమరావతి :కేంద్రం నుంచి ఆగిన రెవెన్యూ లోటు భర్తీ నిధులు, ఇతర గ్రాంట్లలో కోత ఒకవైపు! అనుకున్నంతగా పెరగని సొంత ఆదాయం మరో వైపు! ఈ పరిస్థితుల మధ్యే... వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని కొంత వాస్తవిక అంచనాలతో 2026-27 బడ్జెట్‌ను రూపొందించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం రూ.3,32,205 కోట్ల అంచనాలతో అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రెవెన్యూలోటు గ్రాంటు, ఇతర గ్రాంట్ల రూపంలో కేంద్రం నుంచి వచ్చే ఆదాయం నిలిచిపోవడం, కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా అనుకున్నంత పెరగకపోవడంతో రాష్ట్రానికి రూ.15,000 కోట్లకుపైగా నిధులు ఆగిపోయాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కంటే కొత్త బడ్జెట్‌ను కేవలం రూ.10వేల కోట్లు మాత్రమే పెంచారు. ఆ లెక్కలు

- మిగతా 2వ పేజీలో



## ఎవరొచ్చినా కాదనకుండా పార్టీలో చేర్చుకోవాలి

- ఏమాత్రం అవకాశమున్నా వదలొద్దు

కొత్తగూడెం సీపీఐకి.. భైంసా మజ్లీసకు ఇద్దాం

- మంత్రులు బాగా పనిచేశారు.. భేష్
- పురపాలక సంఘాలను దేశంలోనే
- ఆదర్శంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపడదాం
- ఇదే ఊపుతో పరిషత్ సంగ్రామంలో గెలుద్దాం
- త్వరలోనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు!
- మంత్రులతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో

## ఆ ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు...
## అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?

- కూటమి బడ్జెట్‌లో నాయకుల పేర్లు తప్ప కేటాయింపులు లేవన్న బొత్స
- మహిళలకు సున్నా వడ్డీ పథకాన్ని రద్దు చేసి మోసం చేశారని విమర్శ
- ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర అప్పుల లెక్కలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని వ్యాఖ్య
- ఈ బడ్జెట్ ప్రజల ధైర్యాన్ని, స్థైర్యాన్ని దెబ్బతీసిందని తీవ్ర విమర్శ



2లో

## అసెంబ్లీకి ఒకే వస్త్రధారణలో వచ్చిన కూటమి మహిళా ప్రజాప్రతినిధులు..

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో శివరాత్రి ముందస్తు సందడి
- ఒకే రకమైన వస్త్రధారణలో మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ
- మహిళా ప్రజాప్రతినిధుల ఐక్యతను అభినందించిన పవన్
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు సంధ్యారాణి, సవిత, ఎమ్మెల్యే మాధవి



2లో



## 30 మున్సిపాలిటీలకుపైగా గెలుచుకుంటామని అనుకున్నాం కానీ

- ఎక్స్ అఫీషియో ఓట్ల నమోదు విషయమై సీఎస్‌తో మాట్లాడాం
- 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటామని అనుకున్నాం.. కొంత తగ్గింది
- హంగ్ వచ్చిన చోట కూడా మాకు అనుకూలంగా ఉంటుంది
- స్థానికంగా జరిగిన ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయి-కేటీఆర్

2లో

# ఈఎల్ఎఫ్‌పై ల్యాండైన మోదీ



### లాంఛనంగా జాతికి అంకితం

### ఈశాన్యంలో తొలి హైవేరన్‌వే గర్వించదగ్గ క్షణాలివి: ప్రధాని

గువాహటి/మోరాన్: ఈశాన్య భారతదేశంలో నిర్మితమైన తొలి హైవేరన్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లాలో మోరాన్ సమీపంలో నేషనల్ హైవే 37పై సిద్ధం చేసిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్ఎఫ్)పై వాయుసేనకు చెందిన సీ130జె రవాణా విమానంలో ప్రధాని దిగారు. అనంతరం దాన్ని లాంఛనంగా జాతికి అంకితం చేశారు. ఈశాన్య భారతదేశానికి తొలి ఈఎల్ఎఫ్ సదుపాయం అందుబాటులోకి రావడం నిజంగా గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రాకృతిక విపత్తులు తదితర సమయాల్లో ఈ సదుపాయం ఎంతగానో ఉపయోగపడుతుందని హర్షం వెలిబుచ్చారు.

## కుట్రలు చేస్తే... మీ అందరినీ రాజకీయ సమాధి చేస్తా: బండి సంజయ్

- కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే అన్న బండి సంజయ్
- మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ అంటున్నాయని మండిపాటు
- ఆ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని విమర్శ

2లో



## ది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది

- తాము రాజకీయ పార్టీగా మారబోతున్నట్లు తెలియగానే బీఆర్ఎస్ ట్రోలింగ్ చేసిందని ఆగ్రహం
- బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికైనా తప్పులను సరిదిద్దుకోవాలని కవిత సూచన
- వడ్డేపల్లిలో ఏఐఎఫ్‌బీ, తెలంగాణ జాగృతి కలిసి విజయం సాధించిందన్న కవిత

## అసెంబ్లీకి ఒకే వస్త్రధారణలో వచ్చిన కూటమి మహిళా ప్రజాప్రతినిధులు..

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల వేళ అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. సభలో రాజకీయ అంశాలపై వాడివేడి చర్చలు జరుగుతున్నప్పటికీ, రేపటి మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక, ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. కూటమి ప్రభుత్వానికి చెందిన మహిళా మంత్రులు, శాసనసభ్యులు భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూ ఒకే రకమైన వస్త్రధారణతో సభకు హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు. మహా శివరాత్రి పర్వదినం సమీపిస్తున్న సందర్భంగా, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సహా పలువురు మహిళా ప్రజాప్రతినిధులు శివతత్వానికి ప్రతీకగా నిలిచే ప్రత్యేకమైన చీరలను ధరించి అసెంబ్లీకి వచ్చారు. శాసనసభ ప్రాంగణం వారి రాకతో కళకళలాడింది. మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, ఎస్. సవితతో పాటు ఇతర మహిళా ఎమ్మెల్యేలు సైతం ఈ ప్రత్యేక డ్రెస్ కోడ్‌ను పాటించారు. ఒకే రంగు, ఒకే తరహా వస్త్రధారణతో కనిపించిన వారి ఐక్యత సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది

తమ సంస్థ రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు తమను ట్రోలింగ్ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కానీ తమను లక్ష్యంగా చేసుకున్న వారికి ఒకటే విషయం చెబుతున్నానని, ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. ఇప్పుడే తొందరపడి మాట జారవద్దని, తమపై కారుకూతలు కూయవద్దని బీఆర్ఎస్ వారిని హెచ్చరించారు. ఇప్పటికైనా మీ తప్పులను సరిదిద్దుకోవాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు ఉద్యమకారులను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఈసారి 16 స్థానాలకే పరిమితమైందని కవిత గుర్తు చేశారు. ప్రజల మద్దతును ఎందుకు కోల్పోయామో బీఆర్ఎస్ ఆలోచించాలని సూచించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పనిచేసిందని కవిత ఆరోపించారు. ఆ రెండు పార్టీల పొత్తుకు ఇది తొలి మెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మిలాఖత్ అయిన సీపీఐకి కొత్తగూడంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై సాంబశివరావు చేసిన ఆరోపణలను అంగీకరిస్తున్నారా అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఆ లోటును తెలంగాణ జాగృతి భర్తీ చేస్తుందని కవిత పేర్కొన్నారు. బీజేపీ కరీంనగర్‌లో తప్ప ఎక్కడా గెలవలేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. తమకు 17 స్థానాలు రావడమే చాలా ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడటం విచిత్రమని కవిత అన్నారు.

## 30 మున్సిపాలిటీలకుపైగా గెలుచుకుంటామని అనుకున్నాం కానీ

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ అభ్యర్థుల గెలుపు, హంగ్ మున్సిపాలిటీల్లో వ్యూహాలు, ప్రతిపక్షాల పనితీరుపై ఆయన తన విశ్లేషణను పంచుకున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సుమారు 30కి పైగా మున్సిపాలిటీలను సొంతం చేసుకుంటుందని భావించినప్పటికీ, తుది ఫలితాల్లో ఆ సంఖ్య కొంత మేర తగ్గిందని ఆయన అంగీకరించారు. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని (హంగ్) మున్సిపాలిటీల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా చైర్మన్ పీఠాలను దక్కించుకోవడంలో కీలకమైన 'ఎక్స్ అఫీషియో' ఓట్ల నమోదు విషయంలో ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ (రాజుజ) అధికారులతో చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తమ పార్టీకి ఉన్న ప్రజాప్రతినిధుల మద్దతుతో హంగ్ ఏర్పడిన చోట్ల కూడా పట్టు సాధిస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని కేటీఆర్ విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ గాలిలో మేడలు కట్టింది కానీ, క్షేత్రస్థాయిలో ప్రజలు వారికి ఆశించినన్ని మున్సిపాలిటీలు ఇవ్వలేదు" అని ఎద్దేవా చేశారు. ఇక బీజేపీ పరిస్థితిని ప్రస్తావిస్తూ.. కరీంనగర్, నిజామాబాద్ వంటి ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ ప్రభావం శూన్యమని కొట్టిపారేశారు.

## కుట్రలు చేస్తే... మీ అందరినీ రాజకీయ సమాధి చేస్తా: బండి సంజయ్

కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒకటేనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆ మూడు పార్టీలకు ప్రేమికుల రోజు శుభాకాంక్షలు అని వ్యగ్యంగా అన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ స్థానాలు వచ్చినప్పటికీ... మేయర్ పీఠం దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ చెబుతున్నాయని... ఏ విధంగా దక్కించుకుంటాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని చెప్పారు. కరీంనగర్ మేయర్ పీఠం తమదేనని బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తే... కరీంనగర్ నుంచే యుద్ధాన్ని ప్రారంభిస్తానని హెచ్చరించారు. వారందరినీ రాజకీయ సమాధి చేస్తానని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ కార్యకర్తల శక్తి, దమ్ము మీకు తెలియదు అని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో బీజేపీకి కేవలం 13 సీట్లే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చిందని సంజయ్ తెలిపారు. అందుకే, ఈ విజయాన్ని ఇంటెలిజెన్స్ కే అంకితమిస్తున్నామని అన్నారు. మేయర్ పదవి కోసం గుంటనక్కలన్నీ ఏకమయ్యాయని మండిపడ్డారు. బీజేపీ సింహమని, సింగిల్ గానే వస్తుందని చెప్పారు. మరోవైపు, కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా... బీజేపీ 30 డివిజన్లలో జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 స్థానాలకే పరిమితమయ్యాయి. ఈ నెల 16న కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం ఉంటుంది.

## ఎవరొచ్చినా కాదనకుండా పార్టీలో చేర్చుకోవాలి

హైదరాబాద్, :రాష్ట్రంలో హంగ్ ఫలితాలు వచ్చిన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను 'చే'జిక్కించుకోవాలని.. కాంగ్రెస్‌కు సాఫీగా అధికారం దక్కేలా చూడాలని మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏమాత్రం అవకాశమున్నా వదులుకోవద్దని.. పార్టీపై అభిమానంతో ఎవరొచ్చినా కాదనకుండా చేర్చుకోవాలని సూచించారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో మజ్లిస్ తోడు అవసరమైన నేపథ్యంలో కాంగ్రెస్‌కు మేయర్, మజ్లిస్ కు డిప్యూటీ మేయర్ పదవులు దక్కేలా చూసుకోవాలని చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్, బోధన్, జగిత్యాల, జహీరాబాద్‌లో మజ్లిస్ సహకారం తీసుకుని, భైంసా మునిసిపాలిటీని మజ్లిస్ కు ఇద్దామని నిర్దేశించారు. మునిసిపల్ ఎన్నికల ఫలితాలపై శనివారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో మంత్రులతో సీఎం సమావేశమయ్యారు. భేటీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రణాళిక సంఘం వైస్‌ఛైర్మన్ చిన్నారెడ్డి హాజరవగా, వర్చువల్ విధానంలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హంగ్ ఫలితాలు వచ్చిన మునిసిపాలిటీలపై చర్చించారు. హంగ్ ఫలితాలు వచ్చిన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను దక్కించుకునే బాధ్యతలను మంత్రులు, నేతలకు సీఎం అప్పగించారు.



నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ప్రక్రియ బాధ్యతను మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు, జగిత్యాల మున్సిపాలిటీ బాధ్యతలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు, కరీంనగర్ కార్పొరేషన్ బాధ్యతలు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లకు, జహీరాబాద్ బాధ్యతలు మంత్రి దామోదర రాజనర్సింహకు, బోధన్ బాధ్యతలు సలహాదారు సుదర్శన్‌రెడ్డికి అప్పగించారు.

మిగతా చోట్ల కూడా పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు. పార్టీలో చేరేవారిని ఆహ్వానించాలని.. కాంగ్రెస్ పార్టీపై అభిమానంతో వచ్చేవారిని కాదనకుండా చేర్చుకోవాలని సీఎం నిర్దేశించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో స్వతంత్రులు, ఇతరుల మద్దతు లభిస్తే పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నించాలని, ఏ మాత్రం అవకాశమున్నా వదులుకోవద్దని మంత్రులకు సీఎం సూచించారు.దకొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐ గణనీయ సంఖ్యలో సీట్లు సాధించిన నేపథ్యంలో ఆ పార్టీకే మేయర్ పదవి దక్కేలా సహకారం అందించాలని సీఎం సూచించారు. జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో సీపీఐతో అవగాహన ఉందని, వాస్తవానికి పురపాలక ఎన్నికలకు ముందే సీపీఐతో పొత్తు కుదుర్చుకోవాల్సి ఉన్నా స్థానిక పరిస్థితులతో సాధ్యం కాలేదని గుర్తు చేశారు. సీపీఐతో చర్చలు జరిపే బాధ్యతను ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొంగులేటి, ఏఐసీసీ కార్యదర్శి వంశీకి అప్పగించారు.

**ఇదే ఊపుతో పరిషత్ ఎన్నికలకు..**

రానున్న జిల్లా, మండల ప్రజాపరిషత్ ఎన్నికల్లో ఇదే ఊపుతో ముందుకు వెళ్లాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వీలుందని.. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల స్ఫూర్తితో విజయం సాధించేలా వ్యూహాలు అమలు చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారని మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. అంతా కలసికట్టుగా పనిచేయడం వల్లే మంచి ఫలితాలు సాధించామన్నారు.

## ఆ ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు... అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆత్మస్తుతి... పరనింద అన్నట్టు బడ్జెట్ ప్రసంగం సాగిందని విమర్శించారు. ఇది అంకెల గారడీతో కూడిన పసలేని బడ్జెట్ అని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ పేర్లను పదిసార్లు ప్రస్తావించడం తప్ప ప్రజలకు మేలు చేసే అంశాలు ఏవీ లేవని ఆయన దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ ప్రజల్లో ఉన్న కొద్దిపాటి ధైర్యాన్ని, స్థైర్యాన్ని కూడా దెబ్బతీసిందని, ఇది మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో బొత్స మాట్లాడుతూ, ప్రతి రంగంలోనూ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని ఆరోపించారు. మహిళా సాధికారతపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని బొత్స తీవ్రంగా తప్పుపట్టారు. ప్రతి ఇంట్లో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "గతంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి, వారిలో పారిశ్రామిక స్ఫూర్తిని నింపడానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ పథకాన్ని తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సున్నా వడ్డీని అమలు చేశాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్కరోజు కూడా ఆలస్యం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సున్నా వడ్డీ డబ్బులు జమ అయ్యేవి. కానీ ఈ ప్రభుత్వం వచ్చి 19 నెలలైనా ఆ సున్నా వడ్డీ పథకం ఏమైందో తెలియదు. బడ్జెట్‌లో దానికి కేటాయింపులు లేవు. ఎలాంటి ఆర్థిక చేయూత లేకుండా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎలా మారుస్తారో చంద్రబాబు చెప్పాలి. ఇది మహిళలను మోసం చేయడం కాదా?" అని బొత్స ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం (చీ=జు+తూ) నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం కోత పెట్టిందని బొత్స ఆరోపించారు. "గతంలో ఉపాధి హామీ పథకం కింద 100 శాతం నిధులను కేంద్రమే భరించేది. ఇప్పుడు కేంద్రం నిబంధనలు మార్చి మెటీరియల్, లేబర్ కాంపోనెంట్లలో 40 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పింది. గత ప్రభుత్వాల హయాంలో ఏటా సగటున రూ. 5,000 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసేవారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్రం కనీసం రూ. 2,000 కోట్లు కేటాయించాలి. కానీ బడ్జెట్‌లో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే చూపించారు. మిగిలిన బ్యాలెన్స్ సంగతేంటి? అంటే ఈ పథకాన్ని కూడా నీరుగార్చబోతున్నారా?" అని ఆయన నిలదీశారు. రాష్ట్ర అప్పుల విషయంలోనూ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని బొత్స ఆరోపించారు. రాష్ట్ర విభజన నుంచి వారసత్వంగా రూ. 9.46 లక్షల కోట్ల అప్పులు వచ్చాయని చెప్పడం సత్యదూరమని అన్నారు. "మా ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్లతో కలిపి మేం చేసిన అప్పు కేవలం రూ. 3 లక్షల కోట్లు మాత్రమే.

## ఈఎల్ఎఫ్‌పై ల్యాండైన మోదీ

(మొదటి పేజీ తరువాయి)

అబ్బురపరిచిన ఏరియల్ షో మోదీ ఒక రోజు పర్యటన నిమిత్తం శనివారం అస్సాం చేరుకున్నారు. ఉదయం ఢిల్లీ నుంచి ఆయన చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్, రాష్ట్ర మంత్రులు తదితరులు ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం సీ130జె హెర్క్యులస్ విమానంలో ఆయన ఈఎల్ఎఫ్‌కు చేరుకున్నారు. రన్‌వేపై దిగాక సమీపంలో సిద్ధం చేసిన వేదికకు చేరుకున్నారు. అనంతరం ఈఎల్ఎఫ్‌పై వాయుసేన నిర్వహించిన ప్రత్యేక ఏరియల్ షోను వీక్షించారు. 20 నిమిషాలకు పైగా సాగిన ఈ షో ఆహూతులకు కనువిందు చేసింది. యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పైలట్లు ఈఎల్ఎఫ్‌పై కచ్చితత్వంతో ల్యాండింగ్, టేకాఫ్‌తో పాటు పలు విన్యాసాలు నిర్వహించారు. స్థానికులు భారీ సంఖ్యలో వాటిని వీక్షించారు. తొలుత సుఖోయ్ 30 ఎంకేఐ, దాని వెనకే రఫేల్ ఈఎల్ఎఫ్ నుంచి టేకాఫ్ అయ్యాయి. తర్వాత ఏఎన్32 హెలికాప్టర్ టచ్ అండ్ గో విన్యాసాలు ప్రదర్శించింది. తర్వాత మూడేసి చొప్పున తొలుత సుఖోయ్, తర్వాత రఫేల్ యుద్ధ విమానాలు ప్రత్యేక విన్యాసాలతో అలరించాయి. విపత్తుల వేళ చేపట్టే సహాయక చర్యల సన్నద్ధతను ప్రత్యేకంగా తయారు చేసిన అధునాతన దేశీయ హెలికాప్టర్లు (ఏఎల్‌హెచ్) కళ్లకు కట్టాయి. అనంతరం ప్రధాని గువాహటి చేరుకున్నారు. అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లాలో నిర్మించిన ఈఎల్ఎఫ్ వ్యూహాత్మకంగా ఎన్నోవిధాలుగా అత్యంత కీలకమైనది. ఈ ఈఎల్ఎఫ్ చైనాకు 300 కి.మీ., మయన్మార్‌కు కేవలం 200 కి.మీ. దూరంలో ఉంటుంది. 4.2 కి.మీ. పొడవైన ఈ హైవేరన్‌వేను రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించారు. సైనిక, పౌర అవసరాలు రెండింటికీ పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా వాయుసేన సహకారంతో దీన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. పొరుగు దేశాలతో ఘర్షణల వేళ ప్రత్యర్థులు సమీపంలోని వైమానిక స్థావరాలపై దాడులు చేస్తే బలగాల తరలింపు తదితరాలకు తక్షణ సదుపాయంగా ఈఎల్ఎఫ్ కీలకపాత్ర పోషిస్తుంది. విపత్తులు, ఎమర్జెన్సీ సమయాల్లో దిబ్రూగఢ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగా కూడా పని చేస్తుంది. దిబ్రూగఢ్‌మోరాన్ జాతీయ రహదారి37పై నిర్మించిన ఈఎల్ఎఫ్‌పై అన్నిరకాల యుద్ధ, రవాణా విమానాలనూ సులువుగా దించవచ్చు. రఫేల్, సుఖోయ్‌తో పాటు పలు భారీ రవాణా విమానాలు కూడా దీనిపై విజయవంతంగా ట్రయల్ రన్స్ నిర్వహించాయి.

## కష్టాల బండిని గాడిన పెట్టడమే లక్ష్యం

పరిశీలిస్తే... పెరుగుతున్న రెవెన్యూ లోటు కట్టడి చేయడంపై దృష్టి సారించినట్లు అర్థమవుతోంది. అప్పులు తగ్గిస్తూ, మూలధన వ్యయం పెంచుతూ, సంక్షేమాన్ని సాగిస్తూనే అభివృద్ధి దిశగా కదిలేలా చర్యలు చేపట్టారు. కేవలం ఒక ఆర్థిక సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని కాకుండా... రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సుదీర్ఘ లక్ష్యాల సాధనకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించినట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పలుమార్లు ఉద్ఘాటించడం గమనార్హం. జీఎస్‌డీపీలో రాష్ట్ర పబ్లిక్ డెట్ 36 శాతం... అంటే రూ.7,11,094 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇది 2025-26తో పోల్చితే 75వేల కోట్లు అధికం. జీఎస్డీపీలో పబ్లిక్ డెట్ వాటా 36 శాతం యథాతథంగా ఉండటం ఇందులో సానుకూల అంశం. ఇక... అభివృద్ధికి, ఆస్తుల కల్పనకు సంకేతమైన మూలధన వ్యయాన్ని కూడా బాగా పెంచారు. బడ్జెట్‌లో ఇందుకు రూ.53,915 కోట్లు కేటాయించారు. మొత్తం ఖర్చులో ఇది 16 శాతం. 2024-25లో 8 శాతం, 2025-26లో 13 శాతం ఉన్న మూలధన వ్యయం ఈసారి 16 శాతానికి చేరడం విశేషం. దీనినే రూపాయల్లో చూస్తే... రాబోయే బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని రూ.53,915 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.34,498 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.21,172 కోట్లను మూలధనం కోసం ఖర్చు చేశారు.

కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రూ.64,362 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.56,741 కోట్లు వస్తాయని అంచనా. గత ఆర్థిక సంవత్సరంలో రూ.52,080 కోట్లు వచ్చాయి.దపన్నేతర ఆదాయం రూ.11,474 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14,324 కోట్లుగా పేర్కొన్నారు. అంటే... కొంత వాస్తవికంగా ఆలోచించి అంచనాలు తగ్గించారన్న మాట. కానీ, గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.5972 కోట్లు మాత్రమే వచ్చింది. సొంత పన్నుల ఆదాయం 2026-27లో రూ.1,25,846 కోట్లు వస్తుందని అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.98,025 కోట్లు వస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.89,435 కోట్లు వచ్చింది. బడ్జెట్లో అంచనా వేసిన మొత్తం ఆదాయంలో పన్ను ఆదాయం



54 శాతం, పన్నేతర ఆదాయం 5 శాతం, గ్రాంట్లు 14 శాతం, కేంద్ర పన్నుల్లో వాటాగా 27 శాతంగా చూపించారు. రాబోయే ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో అప్పులను రూ.98,065 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అప్పులు రూ.1,03,631 కోట్లకు చేరుతాయని చూపించారు. 2026-27లో అంచనా వేసిన అప్పుల్లో ఆర్‌బీఐ నుంచి 78 శాతం, కేంద్రం నుంచి తీసుకునే రుణాల ద్వారా 19 శాతం, ఇతర రుణాలు 2 శాతం, డిపాజిట్లు, ట్రాన్సాక్షన్ నెట్ రూపంలో ఒక శాతం అప్పులు వస్తాయి. 2026-27లో రెవెన్యూ వ్యయాన్ని రూ.2,56,143 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత (2025-26) ఆర్థిక సంవత్సరంలో రూ.2,38,022 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.



మృతుడు పోలేపల్లి మనోజ్



పరమేష్

# కరెంట్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు యువకులు మృతి



**వలిగొండ, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** వలిగొండ మండల పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. మండలంలోని సుంకిశాల గ్రామ సమీపంలో కరెంట్ స్తంభాన్ని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం, సుంకిశాల గ్రామానికి చెందిన పోలేపల్లి మనోజ్ కుమార్, వలిగొండ మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన పరమేష్ ఇద్దరూ బైక్‌పై రేపాక వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రేపాక నుండి సుంకిశాల గ్రామం వైపు వెళ్లే దారిలో అదుపు తప్పిన బైక్ కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికీ తలకు తీవ్ర గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి.ద


# రామలింగేశ్వర దేవస్థానానికి ఎల్ఈడీ లైట్లు బహుకరణ

- దాత కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి




**వలిగొండ, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో రాముని గుట్టపై వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం నిర్వహించనున్న శివపార్వతుల కళ్యాణం కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. రాత్రి వేళ గుట్టపై జాగారం చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం పరిసర ప్రాంతాల్లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన దాత కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి రూ.20 వేల వ్యయంతో ఈ లైట్లను అమర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు దాతను అభినందించారు. దేవస్థానం అభివృద్ధికి ఇతర గ్రామ దాతలు కూడా ముందుకు వచ్చి సహకరించాలని భక్తులు కోరారు.

# 16న 'ప్రజావాణి' రద్దు: కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ఈ నెల 16న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో, జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది అంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన అర్జీల స్వీకరణ కార్యక్రమం ఉండదని వివరించారు. ప్రజలు ఈ మార్పును గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# 16న మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం


- ఉదయం 11 గంటలకే ప్రక్రియ ప్రారంభం
- చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి
- మున్సిపాలిటీల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం
- జిల్లా కలెక్టర్ హనుమంతరావు






**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికైన వార్డు కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం ఈ నెల 16న నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల అధికారి చాంబర్లో మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు, ఎక్స్ ఆఫిషియో సభ్యులు సమావేశమై చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 16న జరగనున్న ప్రమాణ స్వీకారానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన విధి విధానాల ప్రకారం సమయపాలన పాటిస్తూ ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం నిర్వహించాలని సూచించారు. చైర్మన్, వైస్ చైర్మన్ అభ్యర్థులకు పార్టీ 'ఏ' , 'బి' ఫారాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నియమ నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించి ప్రమాణ స్వీకారం పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి మున్సిపాలిటీకి ఒక అధికృత అధికారిని నియమించినట్లు వెల్లడించారు. భువనగిరి మున్సిపాలిటీకి అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, పోచంపల్లి మున్సిపాలిటీకి జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆలేరు మున్సిపాలిటీకి ఆర్డీఓ కృష్ణారెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఆర్డీఓ శేఖర్ రెడ్డి, మోత్కూర్ మున్సిపాలిటీకి అదనపు డీఆర్డీఓ సురేష్‌ను నియమించినట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలో మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.


# శివనామస్మరణతో మారుమ్రోగిన మత్స్యగిరి



- ఘనంగా పంచముఖ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం
- కార్యనిర్వహణాధికారి సల్వాద్రి మోహన్ బాబు

**వలిగొండ మండలం, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెంకటాపురంలో ఉన్న శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీ పార్వతీ సమేత పంచముఖ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 14 నుండి 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి సల్వాద్రి మోహన్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల భాగంగా శనివారం సాయంత్రం 4.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యము, అఖండ దీపారాధన, దీక్షాధారణ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, భేరిపూజ, ధ్వజారోహణం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.





# అదిలాబాద్ బల్దియా బాస్ ఎవరు.?

**ఆదిలాబాద్ (తొలివెలుగు):** అదిలాబాద్ బల్దియా గడ్డపై బిజెపి సమర శంఖం పూరించిన నేపథ్యంలో చైర్మన్ గిరికో సం పైరవీలు ప్రారంభమయ్యా యి. ఇప్పటికే ఆ పార్టీ అభ్య ర్థు లందరూ ప్రత్యేక శిబిరానికి తరలి వెళ్లారు. ఆదిలాబాద్ ఎ మ్మెల్యే పాయల్ శంకర్ ఆ ధ్వ ర్యంలో అజ్ఞాతంగా ప్రత్యేక శి శిబిరంలో ఆ పార్టీ అభ్యర్థులం తా ఉన్నారు. ఆ పార్టీ అనూహ్య రీతిలో ఆదిలాబాద్ లో ఘనవిజయం సాధించింది. మొత్తం 49 వార్డులకు గాను 21 వార్డుల్లో బిజెపి విజయ ఢంకా మ్రోగించింది. అయితే బిజెపికి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో పలువురు స్వ తంత్రుల మద్దతుతో బిజెపి జెండా ఎగరవేసేందుకు సిద్ధ మైంది. ముగ్గురు స్వతంత్ర అ భ్యర్థులు కూడా బిజెపికి మద్ద తునిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో తమకు టికెట్టు ఇస్తామని చివరి వరకు నమ్మించి మోసం చేసిన పలువురు రెబెల్స్ తమ సత్తా చాటేందుకు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి దిగి విజయం సాధించారు అయితే ఆ పార్టీపై గురువుగా ఉన్న స్వతంత్రులు బిజెపికి మద్దతు ఇచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అదిలాబాద్ బల్దియా కూర్చిపై కూర్చోవ డానికి కనీసం 25 వార్డుల్లో గె లుపొంది ఉండాలి. స్పష్టమైన మెజారిటీ లేకపోవడం వల్ల స్వతంత్రుల కోసం బిజెపి గా లం వేసింది. అయినప్పటికీ ముగ్గురు స్వతంత్రులు బిజెపి గాలానికి పడ్డట్లు తెలుస్తోంది. బిజెపికి మద్దతు ఇచ్చేందుకు ముగ్గురు స్వతంత్రులు రావ డంతో ఇక బల్దియా గడ్డపై జెం డా ఎగరవేసేందుకు సిద్ధమైం ది. అయితే చైర్మన్ గిరి కోసం ఆ పార్టీలో పైరవీలు ప్రారంభ మైనట్లు తెలుస్తోంది. అదిలా బాద్ చైర్మన్ గిరి ఈసారి మ హిళా జనరల్ కు కేటాయిం చారు. బిజెపి లో దాదాపు 14 మంది మహిళలు ఈ సారి గె లుపొందారు. అందులో అం దరూ సీనియర్లు కావడం వల్ల ఎవరికి ఇవ్వాలో, పార్టీకి అం తు బట్టలేక పోతుంది. గత కొంతకాలం నుంచి అనేక సేవా కార్యక్రమాల్లో ఉన్న నిషిధ ఆ దిత్య ఖండేష్కర్ వైపు పార్టీ మగ్గుచూపుతున్నట్లు తెలు స్తోంది. అయితే పార్టీలో ఈమె కన్నా అనేకమంది సీనియర్లు ఉన్నారు. ఇప్పటికి రెండు, మూడు మార్లకు పైగా కౌన్సిల ర్లుగా విజయం సాధించిన వారు కూడా ఉన్నారు. అదిలాబాద్ చైర్మన్ కోసం బిజెపి లో తీవ్ర పోటీ నెలకొంది. శిబి రంలో ఉన్న వార్డు సభ్యులంద రూ అక్కడే నిర్ణయించుకొని నేరుగా మున్సిపల్ కార్యాల యానికి వచ్చి చైర్మన్ ను ఎ న్నుకునే అవకాశాలు కనిపిస్తు న్నాయి ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే బిజెపి అ భ్యర్థులందరూ ప్రత్యేక క్యాం పుకు తరలి వెళ్లారు. అయితే గెలుపొందని వారు బయటకు రాగా గెలుపొందిన వారు క్యాంపు లోనే ఉండిపోయా రు. అక్కడే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని చైర్మన్ ను ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. ఎ మ్మెల్యే పాయల శంకర్ నేతృ త్వంలో చైర్మన్ ను ఎన్నుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదిలాబాదులో ఎక్స్ అఫీషి యో ఓట్లు కూడా రెండు ఉ న్నాయి.



# రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

- మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సృష్టి లయకారుడైన ఉమా మహేశ్వరుడు అనునిత్యం భక్తులకు కొంగుబంగారంగా నిలిచే సర్వాంతర్యామి అని పేర్కొన్నారు. భోళా శంకరుడిగా భారతీయ ఆధ్యాత్మిక, సామాజిక జీవనంలో పరమశివునికి విశిష్ట స్థానం ఉందన్నారు. ప్రాణికోటిని రక్షిస్తూ సృష్టి మనుగడ కోసం గరళాన్ని మింగిన మహా త్యాగి, ఆది యోగి, గరళకంఠుడు పరమేశ్వరుడు అని కొనియాడారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# చిదిమేసిన లారీ.. చిన్నారి బలి

- తండ్రికి తీవ్ర గాయాలు.. కుమార్తె మృతి
- ఆరేగూడెంలో విషాద ఛాయలు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** మండల పరిధిలోని లింగోజిగూడెం వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిదేళ్ల చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆరేగూడెం గ్రామానికి చెందిన వడ్డగోని రమేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం సుమారు 12:32 గంటల సమయంలో తన కుమార్తె రిహాన్సిక(9),తో కలిసి బైక్‌పై చౌటుప్పల్ నుండి గ్రామానికి వెళ్తున్నాడు. లింగోజిగూడెం హైవే 9 హోటల్ వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ (జేహెచ్ 06యు7362) బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారి రిహాన్సిక తలపై నుంచి లారీ టైర్ వెళ్లడంతో తల, కాలుకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. తండ్రి రమేష్‌కు తల, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో రమేష్‌ను చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి మౌనిక ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.నర్సిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు:

- రాత్రి షిఫ్టులో పేలిన రియాక్టర్
- చెల్లాచెదురుగా పడ్డ పేలుడు ముక్కలు
- నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని ఎలగిరి గ్రామ శివారులో ఉన్న బృందావనం ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం రాత్రి రియాక్టర్ పేలి నలుగురు కార్మికులు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. జిబ్లాక్‌పల్లి గ్రామానికి చెందిన పగడాల సాయి (26), ఈ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9:50 గంటల సమయంలో రియాక్టర్ రూమ్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో రియాక్టర్ ముక్కలు తగిలి సాయి ఎడమ కన్ను పైభాగంలో తీవ్ర రక్తగాయమైంది. అతనితో పాటు విధుల్లో ఉన్న దుర్గాప్రసాద్ ఎడమ చేతికి, అరుణ్ కుమార్ తలకు, కోమలేష్ పాండేకు తల, కుడి చేతికి బలమైన గాయాలయ్యాయి. బాధితుడు పగడాల సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సీపీఎం పార్టీని ఆదరించిన ఓటర్లకు ధన్యవాదాలు: ఎండి పాషా




**చౌటుప్పల్, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో సీపీఎం పార్టీ అభ్యర్థులను ఆదరించిన ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా తెలిపారు. శనివారం స్థానిక కామ్రేడ్ కందాల రంగారెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) (సీపీఎం) పార్టీ, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మద్దతుతో నాలుగు స్థానాల్లో పోటీ చేసినట్లు తెలిపారు. ఆ స్థానాల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ప్రతి ఓటరికి చౌటుప్పల్ సీపీఎం మున్సిపల్ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో సీపీఎం మున్సిపల్ కార్యదర్శి గోషిక కరుణాకర్, బండారు నరసింహ, ఉష్కాగుల శ్రీనివాస్, బొడ్డు అంజిరెడ్డి, ఆకుల ధర్మయ్య, గుణమోని ఐలయ్య, తొర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, చికూరు ఈదయ్య, బొమ్మకంటి కృష్ణ, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, అవ్వారు గోవర్ధన్, మోగుదాల రాములు, బడేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో జవాన్ల త్యాగాలు చిరస్మరణీయం

- పుల్వామా అమరులకు ఘన నివాళి
- చౌటుప్పల్‌లో వీర జవాన్ల దివస్
- దేశ భక్తిని చాటిన కార్యకర్తలు





**చౌటుప్పల్, ఫిబ్రవరి 14 (తొలివెలుగు ):** పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలర్పించిన వీర జవాన్ల ఆశయాలు నేటి యువతకు నిత్య ప్రేరణదాయకమని బజరంగ్‌దళ్ జిల్లా కో-కన్వీనర్ గోగు రవి పేర్కొన్నారు. శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో 'వీర జవాన్ల దివస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం నుంచి బస్టాండ్ వరకు జవాన్ల స్మరణలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నగర కన్వీనర్ చింతల హేమంత్, గోరక్ష ప్రముఖ్ వివేక్, సందీప్, ఈశ్వర్, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మర్లు రాజకీయంతో పాటు అన్ని రంగాల్లో ఎదగాలి: ఏడుకొండల వెంకటేశం

- రెండో వార్డు కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్యకు ఘన సన్మానం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** కుమ్మర్లు రాజకీయాలతో పాటు విద్య, ఉపాధి, వృత్తి రంగాల్లోనూ ముందుకు సాగాలని కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం అన్నారు. శనివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయ వృత్తి అయిన మట్టి పనుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కుమ్మర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య విజయంలో కీలక పాత్ర పోషించిన లింగోజిగూడెం కుమ్మర్లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షులు ఓరుగంటి గోపాల్, ప్రధాన కార్యదర్శి దరుపల్లి ప్రవీణ్, చిన్నకొండూరు సర్పంచ్ తీగుళ్ల చంద్రయ్య, చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం అధ్యక్షులు సిలివేరు శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు సిలివేరు నరేష్, ప్రధాన కార్యదర్శి పోలేపల్లి ముత్తయ్య, గౌరవ అధ్యక్షులు చిలువేరు జంగయ్య, యూత్ అధ్యక్షులు పోలేపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# హంగ్ మున్సిపాలిటీలపై గులాబీ గురి

**హైదరాబాద్,(తొలివెలుగు):** రాష్ట్రంలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ దక్కని మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ గురిపెట్టింది. ఆయా చోట్ల అత్యధిక పురపాలికలను కైవసం చేసుకొనే దిశ గా పార్టీ అడుగులు వేస్తున్నది. బీఆర్ఎస్ మెజారిటీ స్థానాల్లో విజయం సాధించిన మున్సిపాలిటీల్లో ఇప్పటికే ఆ పార్టీ చెంతకు పలువురు స్వతంత్ర అభ్యర్థులు దరిచేరారు. కొన్నిచోట్ల బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కౌన్సిలర్లు కూడా బీఆర్ఎస్ వైపు నిలిచేందుకు నిర్ణయించుకున్నారు. మరికొందరు పార్టీలో అధికారికంగా చేరకున్నా మద్దతు ప్రకటించారు. ఇలా పలువురు తమ సంపూర్ణ మద్దతు ఇచ్చేందుకు ముందుకొచ్చా రు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 చోట్ల హంగ్ ఏర్పడింది. కొన్నిచోట్ల ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓట్లతో గెలుచుకొనేందుకు పావులు కదుపుతున్నది. ఈ నేపథ్యంలో శనివారం బెల్లంపల్లి మున్సిపాలిటీ 30వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ శంకర్‌సింగ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ కుమారస్వామి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీకి చెందిన 34వ వార్డు కౌన్సిలర్ రామ్మూర్తి బీఆర్ఎస్ పార్టీకే మద్దతు తెలిపారు. బెల్లంపల్లిలో 34 వార్డులకు బీఆర్ఎస్, కాంగ్రెస్ చెరో 14 చోట్ల గెలుపొందాయి. బీజేపీ 2, ఇతరులు 4 స్థానాలు దక్కించుకొన్నారు. మ్యాజిక్ ఫిగర్ చేరుకోవాలంటే బీఆర్ఎస్‌కు నలుగురి మద్దతు అవసరం కాగా, ఇప్పటికే ముగ్గురు కారు పార్టీ వైపు నిలిచారు. మరొకరు మద్దతు తెలిపితే సునాయాసంగా బెల్లంపల్లి మున్సిపల్ పాలకవర్గాన్ని గెలిచే అవకాశం ఉన్నది. రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన చోట్ల బీఆర్ఎస్‌ను వరించే మున్సిపాలిటీలు ఈ కింది విధంగా ఉన్నాయి.

### గులాబీ జెండా ఎగిరే మున్సిపాలిటీలు ఇవే?

జనగామ: వరంగల్ జిల్లా జనగామ మున్సిపాలిటీలో 30 స్థానాలకు బీఆర్ఎస్ 13 చోట్ల, కాంగ్రెస్ 12 స్థానాలు దక్కించుకొన్నాయి. ఐదుగురు స్వతంత్రులు గెలిచారు. ఈ ఐదుగురిలో ఇద్దరు బీఆర్ఎస్‌కే జైకొట్టారు. దీంతో బీఆర్ఎస్ బలం 15కు పెరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యుడైన స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మద్దతుతో ఇక్కడ గులాబీ పార్టీ జయకేతనం ఎగురవేసేందుకు సిద్ధమైంది.

ఇంద్రేశం: సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీలో 18 వార్డులు ఉండగా, బీఆర్ఎస్ 9 స్థానాలు గెలుచుకొన్నది. కాంగ్రెస్ 6, బీజేపీ 2, ఇండిపెండెంట్ 1 చోట గెలిచారు. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థి బీఆర్ఎస్ వైపే నిలిచారు. అలాగే ఎక్స్ అఫీషియోగా పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సైతం బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తుండగా ఇక్కడ బీఆర్ఎస్ విజయం దాదాపు ఖాయమైపోయింది.

అలంపూర్‌లో 10 వార్డులు ఉండగా బీఆర్ఎస్, కాంగ్రెస్ చెరో ఐదు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఎక్స్ అఫీషియో ఓట్లతో బీఆర్ఎస్ గెలుపొందనుంది.

జిన్నారం: సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 20 వార్డులకు బీఆర్ఎస్ 8 , కాంగ్రెస్ 6, బీజేపీ 4, ఇతరులు రెండు చోట్ల గెలుపొందారు. బీఆర్ఎస్‌కు ముగ్గురు సభ్యుల మద్దతు అవసరం ఉండ గా, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలుస్తున్నది. రెండు పార్టీల నుంచి ఎవ రో ఒకరు బీఆర్ఎస్ వైపు మళ్లినా ఇక్కడ విజ యం సాధించే అవకాశాలు పుష్కలం.

జమ్మికుంట: జమ్మికుంటలోని 30 వార్డుల్లో బీఆర్ఎస్ 12, కాంగ్రెస్ 10, బీజేపీ 4, ఇతరులు 4 స్థానాల్లో గెలిచారు. ఇక్కడ బీఆర్ఎస్‌కు నలుగురు సభ్యుల అవసరం ఉండగా, ఇండిపెండెంట్ల దన్నుతోపాటు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మద్దతుతో బీఆర్ఎస్ మున్సిపాలిటీని దక్కించుకొనే అవకాశం ఖాయమైంది.

ఆసిఫాబాద్: ఈ మున్సిపాలిటీలో 20 వార్డులకు బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7, ఇతరులు 4 స్థానాల ను గెలుచుకొన్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌కు ఇద్దరు సభ్యుల మద్దతు అవసరం ఉండగా, ఇతరుల్లో ఇద్దరు బీఆర్ఎస్ వైపు నిలిచినట్టు తెలుస్తున్నది.

కాగజ్‌నగర్: ఇక్కడ 30 వార్డుల్లో బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 9, బీజేపీ 5, ఇతరులు 5 స్థానాలు సాధించారు. అతిపెద్ద పార్టీగా నిలిచిన బీఆర్ఎస్ ఐదుగురు స్వతంత్రులతో కలిసి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయనున్నది.

క్యాతనపల్లి: ఈ మున్సిపాలిటీలో 22 వార్డులకు బీఆర్ఎస్ 10 చోట్ల గెలిచింది. కాంగ్రెస్‌కు 7, ఇతరులకు 5 స్థానాలు దక్కాయి. బీఆర్ఎస్ ఇద్దరు ఇతరుల మద్దతుతో ఈ మున్సిపాలిటీని గెలుచుకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కేసముద్రం: ఈ మున్సిపాలిటీలో 16 వార్డులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో 8 గెలుచుకొన్నాయి. బీఆర్ఎస్‌కే అవకాశాలు మెరుగయ్యాయి.

ఎల్లంపేట: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఎల్లంపేటలోని 24 వార్డుల్లో బీఆర్ఎస్ 12 స్థానాలను కైవసం చేసుకొన్నది. కాంగ్రెస్ 8, బీజేపీకి 4 చోట్ల గెలిచాయి. బీఆర్ఎస్‌కు కేవలం ఒక్కరి అవసరం ఉండగా సునాయసంగా గెలుపొందే పరిస్థితి ఏర్పడింది.

ఇస్నాపూర్: సంగారెడ్డి జిల్లాలోని ఇస్నాపూర్‌లో 26 వార్డులకు బీఆర్ఎస్ 12, కాంగ్రెస్ 10, స్వతంత్రులు 4 స్థానాలను గెలుచుకొన్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌కు ఇద్దరు సభ్యుల మద్దతు అవసరం ఉన్నది. స్వతంత్రుల్లో ఇద్దరు బీఆర్ఎస్ వైపు మళ్లడంతో బీఆర్ఎస్‌కు విజయావకాశాలు మెరుగయ్యాయి.

పరిగి: వికారాబాద్ జిల్లా పరిగిలోని 18 వార్డుల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ చెరో 8 చోట్ల విజయం సాధించాయి. ఇద్దరు స్వతంత్రులు గెలుపొందారు. ఆ ఇద్దరి మద్దతుతో బీఆర్ఎస్ గెలిచే అవకాశమే కనిపిస్తున్నది.

వర్ధన్నపేట: ఈ మున్సిపాలిటీలో 12 వార్డుల్లో బీఆర్ఎస్ 6 చోట్ల, కాంగ్రెస్ 5, ఇండిపెండెంట్ 1 స్థానం గెలుచుకొన్నారు. ఇక్కడ ఆ స్వతంత్ర సభ్యుడి మద్దతుతో బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని కైవసం చేసుకొనే అవకాశం ఏర్పడింది.

# ఓటర్లు కాంగ్రెస్‌ను నమ్మలేదు.. తలసాని శ్రీనివాస్ యాదవ్



**సిద్దిపేట, (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యాన్ని ఏరులై పారించినా ప్రజలు విశ్వసించలేదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం గుడ్డిలో మెల్ల అని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు సహజంగా అధికార పార్టీ వైపు మొగ్గు చూపడం సహజమని తెలిపారు. అయితే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపలేదని అన్నారు. కేసీఆర్ హయాంలో జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో 95 శాతం సీట్లను బీఆర్ఎస్ గెలుచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. 32 జడ్పీ చైర్మన్ స్థానాల్లో విజయం సాధించిందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో చాలాచోట్ల కాంగ్రెస్ పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడి, చివరికి కౌంటింగ్‌లోనూ అక్రమాలకు పాల్పడి గెలిచిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క కార్పొరేషన్‌లోనూ, మెజారిటీ మున్సిపాలిటీల్లోనూ సంపూర్ణ మెజారిటీ సాధించలేదని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా పురోగమిస్తే, కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో కుదేలైందని తలసాని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగునీరు లేక రైతులు పడిన గోసలు చూసిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్టులు నిర్మించినట్టు తెలిపారు. గతంలో నీరు, విద్యుత్తు లేక రా ష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తాను టీడీపీ ప్రభుత్వంలో మంత్రి, ఎమ్మెల్యేగా పని చేశానని, అప్పు డు నాలుగైదు గంటలకు మించి కరెంట్ ఉండేది కాదని అన్నారు. కానీ, కేసీఆర్ గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు.. రైతులు, వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్టు చెప్పారు. రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించిందని అన్నారు. నాడు భూ ముల ధరలు ఆకాశాన్ని తాకితే, కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన విధానాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని ఆందోళన వ్యక్తంచేశారు. నేడు భూములను కోనేవారు లేరని, దీంతో రియల్ ఎస్టేట్‌తోపాటు నిర్మాణ రంగంలో సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు.

# నాపై ఆరోపణలు అవాస్తవం

- సరళ మైసమ్మ దేవాలయ కమిటీ విషయంలో స్పష్టీకరణ
- అల్లాపురం గ్రామ సర్పంచ్ టేకుల మంజులా

**చౌటుప్పల్, ఫిబ్రవరి 14 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామ సర్పంచ్ అధికార దుర్వినియోగం చేశారంటూ ఇటీవల ప్రచారంలోకి వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని సర్పంచ్ మంజులా స్పష్టం చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంజులా మాట్లాడుతూ.. శ్రీ శ్రీ శ్రీ సరళ మైసమ్మ దేవాలయ నూతన కమిటీ ఏర్పాటు నేపథ్యంలో ఫిబ్రవరి 2న గ్రామ సర్పంచ్ లెటర్ హెడ్‌పై దేవాలయ నిర్వాహకులకు, గ్రామ ప్రజలకు ఫిబ్రవరి 8న కమిటీ ఏర్పాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆహ్వానం పంపిన విషయం వాస్తవమేనన్నారు. అయితే ఆ ఆహ్వానానికి దేవాలయ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు స్వయంగా కమిటీని ఎన్నుకుంటామని తెలియజేయడంతో, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఎన్నిక ప్రక్రియను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 8న గ్రామ ప్రజల సమక్షంలోనే నూతన కమిటీ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు తాను, పాలకవర్గ సభ్యులు అతిథులుగా మాత్రమే హాజరయ్యామని తెలిపారు. గ్రామ ప్రజల తీర్మానం ప్రకారం గౌరవ అధ్యక్షుల జాబితాలో తన పేరు చేర్చినట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన తీర్మాన పుస్తకం తన వద్ద ఉన్నదని, అందులో గ్రామ సర్పంచ్ లేదా పాలకవర్గ సభ్యులు కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎక్కడా నమోదు కాలేదని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు చేసిన తీర్మానాల ప్రతులనే పత్రికలకు అందజేసినట్లు పేర్కొన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారు అల్లాపురం గ్రామ సర్పంచ్ గ్రామపంచాయతీ లెటర్ హెడ్‌పై సంస్థాన్ నారాయణపురం మండలం, రాచకొండ రెవెన్యూ పరిధిలోని శ్రీ సరళ మైసమ్మ దేవాలయ కమిటీ ఎన్నికలను తాము నిర్వహించినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. లేనిపక్షంలో తప్పుడు ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, గతంలో సర్పంచ్‌గా పనిచేసిన కొలను శ్రీనివాస్ రెడ్డి హయాంలో



అల్లాపురం గ్రామానికి మంజూరైన నిధులతో సంస్థాన్ నారాయణపురం మండలం, రాచకొండ రెవెన్యూ పరిధిలోని సరళ మైసమ్మ దేవాలయం వద్ద రూ.30 లక్షలతో హాల్, రూ.4 లక్షలతో మరుగుదొడ్లు, రూ.2 లక్షలతో వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టినట్లు గ్రామపంచాయతీ తీర్మాన పుస్తకాలలో నమోదై ఉన్నదని తెలిపారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, ఖర్చు చేసిన నిధులను తిరిగి అల్లాపురం గ్రామపంచాయతీకి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



# రష్యన్ ఆయిల్ కొనుగోలు చేయమని భారత్ హామీ ఇచ్చింది..

రష్యన్ చమురును కొనుగోలు చేయమని భారత్ తమకు హామీ ఇచ్చిందని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అన్నారు. మాస్కో ఇంధన రంగంపై అమెరికా విధించిన తాజా ఆంక్షల మధ్య ఈ వ్యాఖ్యలు వచ్చాయి. శనివారం మ్యూనిచ్ భద్రతా సమావేశంలో రూబియో చెప్పినట్లు మీడియా నివేదించింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా ఇంధన ఆదాయాన్ని కట్టడి చేయడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. యుద్ధం మొదలైన తర్వాత రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న పెద్ద దేశంగా భారత్ ఉంది. ఇదిలా ఉంటే, తమ నుంచి ఆయిల్ కొనుగోలు చేయడం నిలిపేస్తున్నట్లు భారత్ ఎక్కడా చెప్పలేదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ అన్నారు. భారత్, రష్యా నుంచి చమురు దిగుమతుల్ని తగ్గించుకుంటుందా అనే ప్రశ్నల మధ్య భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడుతూ.. " భారత విదేశాంగ విధానంలో స్వతంత్రత ఉందని, చమురు కొనుగోళ్లు కంపెనీల అవసరాలు, ధరలు, రిస్కలను చూసుకుని నిర్ణయిస్తాయి.

# ప్రియురాలిని హత్య చేసి.. సెప్టిక్ ట్యాంక్‌లో పడేసి..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: వివాహితుడైన ఓ వ్యక్తి ప్రియురాలిని హత్య చేసి సెప్టిక్ ట్యాంక్‌లో పడేశాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. కమలా నగర్‌లో నివసించే సమీర్‌కు ఏడాది క్రితం మహారాష్ట్రలోని గోండియా జిల్లాకు చెందిన సియా(33) ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది.ఆమెతో అతను సహ జీవనం చేశాడు. ఈ వ్యవహారంపై సమీర్ భార్య, సియా మధ్య గొడవలు మొదలయ్యాయి. ఫిబ్రవరి 9న జరిగిన గొడవలో సమీర్ ఆగ్రహంతో సియా గొంతు నొక్కి హత్య చేశాడు.

# ప్రధాని మోడీకి ఢాకా ఆహ్వానం..?

రెండేళ్ల అనిశ్చితి తర్వాత పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్పీ) ఘన విజయం సాధించింది. దివంగత మా ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ప్రధానిగా పదవీస్వీకారం చేయనున్నారు. ఇన్నాళ్లు బంగ్లాను పాలించిన తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్ అధికారానికి తెరపడనుంది. ఇదిలా ఉంటే, యూనస్ సమయంలో భారత బంగ్లా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. యూనస్ పాకిస్తాన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి, వారిలో సంబంధాలను పెంచుకున్నాడు. భారత వ్యతిరేకత, హిందువులపై వ్యతిరేకతను నూరిపోయడంలో కీలకంగా వ్యవహరించాడు. అయితే, వీటన్నింటిని పక్కన పెట్టి, ప్రధాని నరేంద్రమోడీని ఢాకాకు ఆహ్వానించాలని బీఎన్పీ అనుకుంటోంది. తారిక్ రెహ్మాన్ ప్రధాని ప్రమాణస్వీకార కార్యక్రమానికి నరేంద్రమోడీని ఆహ్వానించాలని యోచిస్తోంది. ప్రాంతీయ దేశాధినేతలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, ప్రధాని మోడీ కీలక ఆహ్వానితుల్లో ఉంటరని భావిస్తున్నారు. ప్రధాని మోడీ, బంగ్లాకు కాబోతున్న ప్రధాని తారిఖ్ రెహ్మాన్‌తో మాట్లాడిన తర్వాత, ఈ పరిణామం చోటుచేసుకుంది. తారిక్ గెలిచిన తర్వాత ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు. ఒక వేళ ఆహ్వానం అంది, ప్రధాని మోడీ ఢాకా వెళ్తే, భారత్-బంగ్లా మధ్య సంబంధాలు మళ్లీ చిగురించే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార తేదీని ఇంకా ధ్రువీకరించడకపోవడంతో, విదేశీ నాయకుల హాజరును నిర్ధారించలేదు.



# రైతులతో రాహుల్‌గాంధీ భేటీ.. "స్టేజ్ మేనేజ్డ్" అంటూ బీజేపీ ధ్వజం

**రైతులతో రాహుల్‌గాంధీ భేటీ**

**అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చ**

**"స్టేజ్ మేనేజ్డ్" అంటూ బీజేపీ ధ్వజం**



భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం జరిగింది. ఇరు దేశాలు త్వరలో సంతకాలు కూడా చేయనున్నాయి. అయితే అమెరికా వాణిజ్య ఒప్పందంతో అన్నదాతలు రోడ్డెక్కారు. కేంద్ర నిర్ణయంతో రైతులకు ఇబ్బందులేనని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రైతులతో సమావేశం అయ్యారు. ఇప్పటికే ఒకసారి భేటీ కాగా.. తాజాగా మరోసారి పార్లమెంట్ హాల్‌లో కలిశారు. దేశ వ్యాప్తంగా ఉన్న 17 ప్రధాన రైతు సంఘాల ప్రతినిధులను కలిశారు. ఈ ఒప్పందం కారణంగా భారతీయ రైతులకు.. ముఖ్యంగా మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, పండ్లు, గింజలు పండించే రైతులకు హాని కలిగిస్తుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ దేశ వ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చారు. రైతులతో రాహుల్ గాంధీ భేటీ కావడంపై కేంద్రమంత్రి పియూష్ గోయల్ ధ్వజమెత్తారు. దశల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారనిడ ఇదంతా "స్టేజ్ మేనేజ్డ్" అంటూ ధ్వజమెత్తారు. అత్యంత కృత్రిమమైన, నకిలీ సమావేశంగా అభివర్ణించారు. రైతులను తప్పుదారి పట్టించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. కష్టపడి పనిచేసే అన్నదాతలను గందరగోళానికి గురిచేయడం, ప్రభుత్వ ఆర్థిక విధానానికి వ్యతిరేకంగా మనోభావాలను రెచ్చగొట్టడం ఈ సమావేశం లక్ష్యం అని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అన్నారు. భారత వస్తువులపై పరస్పర సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించిందనిడ ఇది వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ఔషధాలలో భారత ఎగుమతులకు ప్రయోజనం చేకూరుస్తుందని ప్రభుత్వం పేర్కొంది. రైతుల ప్రయోజనాలను కాపాడుతూ 90-95 శాతం భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను ఈ ఒప్పందం నుంచి మినహాయించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇటీవలే భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం జరిగింది. గతంలో ఉన్న 50 శాతం సుంకాన్ని 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ బలపడ్డాయి.



# ముంబైలో కూలిన మెట్రో పిల్లర్..

**పలువురికి గాయాలు ముంబైలో ఘోర ప్రమాదం**

**కూలిన మెట్రో పిల్లర్.. పలువురికి గాయాలు**



ముంబైలోని ములుండ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. మెట్రో రైలుకు సంబంధించిన పిల్లర్ కూలిపోయింది. దీంతో పెద్ద ప్రమాదం జరిగింది. రద్దీగా ఉన్న సమయంలో కూలిపోవడంతో అనేక మంది గాయపడ్డారు. పోలీసులు వెంటనే సంఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సబ్వే స్లాబ్ కూలిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నం 12:20 గంటలకు ములుండ్ (పశ్చిమ)లోని జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ సమీపంలో మెట్రో పిల్లర్ కూలిపోయిందని దీవీజ తెలిపింది. నిర్మాణ సమయంలో సిమెంట్ మెట్రో పిల్లర్ భాగం విరిగి రిక్షాపై పడిందని.. ప్రమాదం జరిగిన వెంటనే ముంబై అగ్నిమాపక దళం, పోలీసులు, మెట్రో సిబ్బంది, వార్డ్ సిబ్బంది, 108 అంబులెన్స్ సర్వీస్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయని వెల్లడించింది. ఆటోరిక్షాలో ఉన్న నలుగురు వ్యక్తులు గాయపడినట్లు తెలుస్తోంది.

# 4 రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ కసరత్తు పూర్తి

**ఆదివారం తుది ఓటర్ల జాబితా విడుదలకు ఏర్పాట్లు**

**ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కూడా రంగం సిద్ధం**

దేశ వ్యాప్తంగా మరో మినీ ఎన్నికల యుద్ధం జరగనుంది. నాలుగు కీలకమైన రాష్ట్రాల్లో ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నాయి. త్వరలోనే నాలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ వార్ జరగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు పూర్తి చేసినట్లుగా సమాచారం అందుతోంది. ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటర్ సర్వేను ఇప్పటికే ఈసీ పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎన్నికల సంఘం తుది జాబితాను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇక సోమవారం లేదా మంగళవారం తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికల ప్రక్రియను ముగించవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు బోర్డు ఎగ్జామ్స్ ప్రారంభమయ్యాయి. త్వరలోనే విద్యార్థులకు వేసవి సెలవులు రానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికల షెడ్యూల్ రావొచ్చని వార్తలు వస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ రానున్న నేపథ్యంలో అన్ని పార్టీలు సన్నద్ధమైపోయాయి. తమిళనాడు సీఎం స్టాలిన్ శుక్రవారం మహిళల ఖాతాల్లో రూ.5 వేల చొప్పున జమ చేశారు. ఇక ప్రధాని మోడీ కూడా ఈరోజు అస్సాంలో పర్యటించి పలు కీలక ప్రాజెక్ట్‌లను ప్రారంభించారు. దీంతో అన్ని పార్టీలు ఎన్నికల సమరంలోకి దిగిపోయినట్లు కనిపిస్తోంది.




# పుల్వామా దాడిపై ఆరేళ్ల తర్వాత పాకిస్థాన్ సంచలన ప్రకటనతో.. భారతీయుడి రక్తం మరిగింది!

నేటితో పుల్వామా దాడికి సరిగ్గా ఏడేళ్లు. 2019, ఫిబ్రవరి 14.. సరిగ్గా ఐదేళ్ల క్రితం జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రదాడి జరిగింది. ఇది భారతదేశంలో జరిగిన అతిపెద్ద ఉగ్రవాద దాడుల్లో ఒకటి. ఈ భయానక దాడిలో 40 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. ఈ దాడి అనంతరం.. పాకిస్థాన్‌కు భారత్ గుణపాఠం చెప్పిన తీరు గతంలో ఎన్నడూ జరగలేదు. పుల్వామా దాడికి ప్రతీకారం తీర్చుకునే దిశగా పాక్‌పై భారత్ కఠిన చర్యలు అవలంబించింది. సర్జికల్ స్ట్రైక్ రూపంలో బదులు తీర్చుకుంది. పాకిస్థాన్‌లోకి ప్రవేశించిన భారత సైన్యం పాక్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఇంతకీ పుల్వామా దాడి అనంతరం పాకిస్థాన్ ఎలాంటి ప్రకటన చేసిందో మీకు గుర్తుందా? ఈ ప్రకటన ఇప్పుడు చదివినా ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోంది. పుల్వామా దాడి అనంతరం దేశం మొత్తం బాధలో ఉండగా పాకిస్థాన్ నుంచి ఓ ప్రకటన వచ్చింది. "పుల్వామాలో 40 మంది పారామిలిటరీ సిబ్బంది మరణానికి కారణమైన బాంబుదాడి వెనుక మా హస్తం ఉంది." అని పాక్ అంగీకరించింది. ఈ విషయాన్ని ఆ దేశ వాయుసేన ఎయిర్ వైస్ మార్షల్ ఆపరేషన్ సిందూర్ అనంతరం ఔరంగజేబ్ అహ్మద్ లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చెప్పాడు. దాదాపు ఆరేళ్ల



తరువాత పాకిస్థాన్ ఒప్పుకుంది. అప్పటి వరకు తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పిన పాకిస్థాన్ ఒక్కసారిగా చేసిన ప్రకటన దేశాన్ని కుదిపేసింది. ప్రతి భారతీయుడి రక్తం మరిగింది. "పాక్‌కు చెందిన గగనతలం, భూభాగం, జల సరిహద్దులకు లేదా ప్రజలకు ముప్పుగా పరిణమిస్తే.. వాటిని ఎదుర్కొనేందుకు మేం రాజీ పడబోం. దానిని పట్టించుకోకుండా ఉండలేం.. మా దేశానికి కట్టుబడి ఉంటాం. మా దేశ ప్రజల కీర్తి మొత్తం దళాల్లోనే ఇమిడి ఉండటంతో.. మేము ఎప్పుడూ దానిని నిలబెట్టుకుంటాం. పుల్వామాలో మా అద్భుతమైన ఎత్తుగడలను చూపించాం. మా కార్యదక్షత.. వ్యూహాత్మక చతురతను ఇప్పటికే ప్రదర్శించాం" అని డీజీఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదురి వ్యాఖ్యానించాడు. దీంతో ఔరంగజేబ్ అహ్మద్ వ్యాఖ్యలతో పాక్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందన్న విషయం మరోసారి స్పష్టమైంది.





# మెగా ఛాన్స్ కొట్టేసిన ఛాంపియన్ హీరోయిన్..!

మెగా సక్సెస్‌తో మంచి జోష్‌లో ఉన్నారు మెగాస్టార్ చిరంజీవి. 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాతో సంక్రాంతికి సాలిడ్ హిట్‌ను అందుకున్న మెగాస్టార్ అదే ఊపులో తన నెక్స్ట్ ప్రాజెక్టును లైన్‌లో పెట్టడానికి రెడీ అవుతున్నారు. మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో చిరు నటించనున్న సినిమాపై రోజురోజుకు ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో బ్లాక్ బస్టర్ హిట్ 'వాల్తేరు వీరయ్య' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా రాబోతున్న కొత్త సినిమాలో నటించే నటీనటుల జాబితాపై సోషల్ మీడియాలో రోజుకో కొత్త చర్చ జరుగుతుంది. దవిరామం తీసుకోవడం కంటే సెట్స్‌పై ఉండటానికే ఎక్కువగా ఇష్టపడే మెగాస్టార్, ఈ కొత్త సినిమాను అతి తర్వలో ప్రారంభించబోతున్నారని సమాచారం. ఇప్పటికే డైరెక్టర్ బాబీ కొల్లి ఈ సినిమాకు సంబంధించి ప్రీ-ప్రొడక్షన్ పనులన్నీ పూర్తి చేసి, షూటింగ్ షెడ్యూల్స్‌ను పక్కాగా ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో చిరంజీవి ఒక ఎమోషనల్, పవర్‌ఫుల్ తండ్రి పాత్రలో కనిపించబోతున్నారని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ సినిమాలో కీలకమైన కూతురు పాత్ర కోసం మొదట కృతి శెట్టి పేరు వినిపించింది, ఆ తర్వాత ధురంధర్ బ్యూటీ సారా అర్జున్‌ను దాదాపు ఖరారు చేసినట్లు చర్చ నడిచింది, అయితే ప్రస్తుతం మరొక బ్యూటీ పేరు ఈ జాబితాలో చేరింది. ఇటీవల కాలంలో ఛాంపియన్, విత్ లవ్ వంటి వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న అనస్వర రాజన్ పేరు తాజాగా తెరపైకి వచ్చింది. చిరు కూతురి పాత్ర ఆమెను దాదాపు ఫైనల్ చేసినట్లు చెబుతున్నారు. సినిమాలో చిరు డాటర్ పాత్రకు స్పెషల్ ఇంపార్టెన్స్ ఉండటంతో, డైరెక్టర్ చాలా జాగ్రత్తగా ఆ రోల్ ప్లే చేసే వారిని ఎంపిక చేస్తున్నట్లు టాక్ నడుస్తుంది. భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న పాత్ర కావడంతో అనస్వర నటన సినిమాకు మరింత బలం చేకూర్చనుందని చిత్ర బృందం భావిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.



# నమ్మిన వారంతా ఫూల్సే!

సినీ పరిశ్రమ అంటేనే పుకార్లకు నిలయం. ఎప్పుడు ఎవరితో ఎవరికి లింకు పెట్టి రాస్తారో కూడా తెలియని పరిస్థితి. ఈ విషయంలో బాధితులైన తారలు చాలామందే ఉన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తున్న టాపిక్ ధనుష్, మృణాళ్‌ఠాగూర్‌లదే. ఎయిర్‌పోర్టుల్లోనూ, వేడుకల్లోనూ అనుకోకుండా వీరిద్దరూ కలిసి కనిపించడంతో వీరి ప్రేమను సోషల్ మీడియా ఖరారు చేసింది. ధనుష్, మృణాళ్ ప్రేమలో ఉన్నారనీ, వాలెంటైన్స్ డే రోజున పెళ్లితో ఒకటి కాబోతున్నారని ఓ వార్త సోషల్ మీడియాలో బలంగా వైరల్ అవుతున్నది. దీనిపై తాజాగా మృణాళ్ స్పందించింది. 'అసలు ఈ పెళ్లి రూమర్స్ ఎలా మొదలయ్యాయో.. ఎక్కడి నుంచి స్టార్టయ్యాయో అర్థంకావడం లేదు. నిజానికి ఇది పచ్చి అబద్ధం. ఎవరైతే ఈ పెళ్లి వార్తను నిజమని నమ్మారో, వాళ్లకి 14న రాబోతున్న వాలెంటైన్స్ డే, ఏప్రిల్ 1 లాంటిది. వారందరూ ఫూల్సే' అంటూ అసలు నిజాన్ని చెప్పింది మృణాళ్‌ఠాగూర్.



# 'జైలర్ 2' రిలీజ్ డేట్ ఫిక్స్?

సూపర్ స్టార్ రజినీకాంత్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన సినిమా లో 'జైలర్' ఒకటి. ఇప్పుడు దానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2'పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీ గురించి ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమా రిలీజ్ విషయంలో చిత్ర యూనిట్ ఒక పక్కా సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. మొదటి భాగం 'జైలర్' 2023 ఆగస్టు 10న విడుదలయ్యి ఇండస్ట్రీ హిట్ కొట్టింది. అందుకే, ఇప్పుడు సీక్వెల్‌ను కూడా అదే ఆగస్టు నెలలో విడుదల చేయాలని మేకర్స్ డిసైడ్ అయ్యారట. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను 2026 ఆగస్టు 12 లేదా 14న ఇండిపెండెన్స్ డే కానుకగా విడుదల చేసే అవకాశం ఉంది. జూన్ లేదా జులైలోనే షూటింగ్ పూర్తయినా, ఆగస్టు సెంటిమెంట్ వర్కౌట్ అవుతుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు. ఈ పార్ట్‌లో కూడా శివరాజ్ కుమార్, మోహన్ లాల్‌తో పాటు బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ కూడా కనిపిస్తారనే ప్రచారం సినిమాపై హైప్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లింది. అనిరుధ్ అదిరిపోయే మ్యూజిక్‌తో ఈసారి కూడా రజినీ తన స్వాగ్‌తో థియేటర్లను షేక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుంది.